క్లుప్తంగా

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయండి

కొత్తగూడెంటౌన్: ఈ నెల 18 నుంచి నిర్వహించనున్న గణేష్ నవరాత్రుల మహోత్సవాలను విజయవంతం చేయాలని కొత్తగూడెం గణేష్ టెంపుల్ ఈఓ కె.సులోచన భక్తులను కోరారు. శుక్రవారం ఆలయంలో మాట్లాడారు. గణేష్ నవరాత్రులను ఘనంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు భక్తులు సహకరించాలని కోరారు. అదేవిధంగా ఆలయంలో అటెండర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్‌ను విధుల నుంచి 15 రోజుల పాటు తొలగించడం జరిగిందన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

చుంచుపల్లి: రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కన్నా ముందు పెండింగ్ పే స్కేల్ అమలు చేయాలని, ఆర్‌పీఎస్ 2013 ఏరియర్స్ బాండ్స్‌కు ఇప్పటి వరకు వడ్డీ, 9 డీఏల ఏరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు వి.జాకబ్, శామ్యూల్, బత్తుల నాగేశ్వరరావు, జానీమియా, నాగేంద్ర సింగ్, శేషుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తీసుకోవాలి

కొత్తగూడెంటౌన్/కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం టౌన్, లక్ష్మీదేవిపల్లి మండలంలోని గణేష్ మండపాలకు పోలీసుశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని సీఐ ఎం.కరుణాకర్, ఎస్ఐ పి.సంతోష్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు వినాయక చవితి ఉత్సవాలకు విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో ఒక కమిటీ ఏర్పడి, వారి వివరాలు పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ప్రైవేట్ స్థలాలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలంటే, సంబంధిత యాజమాని అనుమతి తీసుకోవాలని చెప్పారు. పోలీసుశాఖతో పాటు, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరి అని, డీజేల అనుమతి లేదన్నారు.

బీజేపీ కౌన్సిల్ సభ్యుడు రవీందర్‌కు సన్మానం

చుంచుపల్లి: బీజేపీ సీనియర్ నాయకుడు, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు పైడిపాటి రవీందర్ భారతీయ జనతా పార్టీ స్టేట్ కౌన్సిల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం కొత్తగూడెం జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. పైడిపాటి రవీందర్ మొదటి నుంచి ఆర్‌ఎస్ఎస్ సిద్ధాంతాలతో, అంకితభావంతో పార్టీ అభివృద్ధికి సేవలందిస్తున్నారని చెప్పారు. మండల స్థాయి నుంచి కౌన్సిల్ మెంబర్‌గా అవకాశం రావడం చాలా సంతోషం అన్నారు. కార్యక్రమంలో నోముల రమేష్, పోలిశెట్టి వెంకటేశ్వర్లు, మాలోత్ గాంధీ, ప్రసాద్, ప్రవీణ్, సంపత్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించండి

టేకులపల్లి: విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించడం ద్వారా పేపర్‌లెస్ ఆర్థిక లావాదేవీలు చేసుకున్నట్లేనని బొమ్మనపల్లి విద్యుత్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య అన్నారు. ఈ మేరకు శుక్రవారం బొమ్మనపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని బొమ్మనపల్లి, కొత్తతండా, చంద్రుతండా, గోప్యాతండా, శంభునిగూడెం, మంగ్యా తండా తదితర గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులకు ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్‌లో విద్యుత్ బిల్లులు ఎలా చెల్లించాలో వివరించారు. వినియోగదారులు తప్పకుండా విద్యుత్ బిల్లులు చెల్లించి నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సహకరించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు కుల ధృవీకరణ పత్రం, సర్వీస్ నంబర్‌తో జతచేసి బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అందజేయాలన్నారు. రైతులు వ్యవసాయ కనెక్షన్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేఎల్‌ఎం వసీం పాషా, సర్పంచ్ ఆల్యానాయక్, లక్కా, హరికృష్ణ, సురేష్, బాలు, వెంకన్న పాల్గొన్నారు.

నిధులున్నా నిర్లక్ష్యం!

- ఏళ్ల తరబడి పూర్తికాని లోతువాగు రోడ్డు నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న నాలుగు గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రాన్ని ఆనుకొని ఉన్న లక్ష్మీదేవిపల్లి మండలం లోతు వాగు పంచాయతీకిలో ఏళ్లు గడుస్తున్నా తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా ఆ పంచాయతీలోని మాదిగ పోల్, మెకాళ్లగుంపు, పడిగె గుంపులోని ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టు నిర్లక్ష్యం, అధికారుల అలస్వతం కారణంగా లోతు వాగు పంచాయతీ ప్రజలు నడక యాతన అనుభవిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ పంచాయతీకి కనీసం రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. 2019లో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామపంచాయతీ నుంచి మాదిగ పోల్ గ్రామం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరయ్యాయి. అప్పట్లోనే రోడ్డు నిర్మాణం పనులు కూడా ప్రారంభించారు. కానీ సంబంధిత కాంట్రాక్టర్ 40 ఎంఎం కంకర పరిచి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పనులకు గాను రూ.19 లక్షల బిల్లులు కూడా తీసుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్‌కు వరంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా ఈ తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాలేదు. లోతువాగు పంచాయతీ ప్రజలు మండలాధికారులకు చెప్పినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఎన్నిసార్లు రోడ్డు నిర్మాణం చేయాలని ఆయా గ్రామప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు, ఐటీడీఏ అధికారులకు విన్నవించినా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. లోతువాగు పంచాయతీ ప్రజలు ఏ అవసరానికైనా కొత్తగూడెం రావాల్సిందే. రోడ్డు సక్రమంగా లేకపోవడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు లోతువాగు పంచాయతీకి వెళ్లే మట్టి రోడ్డు కోతకు గురైంది. దీంతో అటుగా రాకపోకలు బంద్ నిలిచిపోయాయి. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు జోక్యం చేసుకొని మట్టి పోయించి, ప్రజలు నడిచేందుకు మార్గం ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు లేక, ఇక్కడి ప్రజలు నిత్యం రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లటం కష్టంగా ఉంది. వర్షాకాలం అయితే ఆయా గ్రామాల ప్రజలు ఊరు బయటికి రావాలంటే నరకం చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అస్తవ్యస్తంగా లోతువాగుకు వెళ్లే రోడ్డు


ఇటీవల కోతకు గురైన ప్రాంతం



ఐటీడీఏ ఏర్పాటు చేసిన బోర్డు

రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నాం..


ఎన్నో ఏళ్ల నుంచి సరైన రోడ్డు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఐటీడీఏ తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు.

– ఈసం రాము

ఓట్ల కోసం వచ్చినప్పుడు చెప్తాం..


లోతువాగు పంచాయతీ మాదిగపోల్, పడగ గుంపు, మోకాళ్ల గుంపుకు సరైన రహదారి లేదు. దీంతో నిత్యం ఆ గ్రామం నుంచి బయటి ప్రాంతాలకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికలు వస్తున్నాయి. ఓట్ల కోసం నాయకులు మా గ్రామానికి వస్తారు. అప్పుడు వారిని ప్రశ్నిస్తాం.

– ఇర్పు సాగర్

మరో పోరాటానికి సిద్ధం కావాలి



మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో గతేడాది 18 రోజుల పాటు జరిగిన సమ్మె ఫలితంగా యాజమాన్యంతో జరిగిన ఒప్పందం అమలుకై సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు మరోమారు పోరాటానికి సిద్ధం కావాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) అధ్యక్షుడు యాకూబ్ షావలీ, రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సతీష్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2013లో బొగ్గు పరిశ్రమ యాజమాన్యాలకు, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతన ఒప్పందం జరిగిందని, దానిని సింగరేణిలో ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. 11వ వేతన ఒప్పందాన్ని బొగ్గు పరిశ్రమలోని కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని, కనీసం ఒకటో క్యాటగిరి వేతనాన్ని అమలు పరచాలని ఐఎన్‌టీయూ ఏళ్ల తరబడి ఆందోళనలు చేస్తోందన్నారు. ఢిల్లీ, నాగపూర్, కలకత్తా, హైదరాబాద్, నగరాల్లో వేజ్‌బోర్డ్ సమావేశాలు జరుగుతున్న సమయంలో కూడా ఆందోళనలు చేశామని అయినప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు విస్మరించటం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాటకు కట్టుబడి, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమకు తగిన వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, పాయం వెంకన్న, ఎం.రాజశేఖర్, శాంతారావు పాల్గొన్నారు.

అధికార పార్టీ కౌన్సిలర్ నిరసన దీక్ష


దీక్షా శిబిరంలో శ్రీవల్లితో స్థానికులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే అధికారులు, అధికార పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని 36వ వార్డు బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ భీమా శ్రీవల్లి శుక్రవారం వార్డులో దీక్ష చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ.. వార్డులో రెండు నెలలుగా కిన్నెరసాని పంపునీళ్లు రావడం లేదని స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వార్డులో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని, వాటిని తొలగించాలని కోరుతూ పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. రోడ్డు వెడల్పులో భాగంగా స్థానిక కౌన్సిలర్‌కు తెలియకుండా మార్కింగ్ ఇచ్చారని, దీంతో ఆయా ఇళ్లవారు, ఎంతో శ్రమపడి నిర్మించుకున్న ఇళ్లు తొలగిస్తారని భయాందోళన చెందుతున్నారని వివరించారు. దీని వలన అధికార పార్టీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులైన వారికి చెడ్డపేరు వచ్చే ప్రమాదం ఉందని, అందుకే నిరసన దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్, విద్యుత్‌శాఖాధికారులు దీక్షా శిబిరం వద్దకు చేరుకొని పెండింగ్ పనులు పూర్తి చేయిస్తామని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. దీక్షలో రాజేశ్వరి, సుజాత, రమ, జయ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి

ఇల్లెందురూరల్: పల్లెలను స్వచ్ఛతకు నిలయాలుగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో స్వచ్ఛత పక్షోత్సవాల కార్యక్రమాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. మాట్లాడుతూ... రహదారులతోపాటు డ్రెయినేజీలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలను శుభ్రం చేయించాలని సూచించారు. ఎక్కడా పిచ్చి మొక్కలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో గడ్డి నివారణ మందు పిచికారీ చేయించాలని ఆదేశించారు. ఆయా గ్రామపంచాయతీలలో డంప్‌షెడ్డులో ఎరువు తయారీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు లీగల్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

కొత్తగూడెంటౌన్: పాల్వంచలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో శనివారం భద్రాద్రి కొత్తగూడెం లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో జిల్లా జడ్జి (జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి) జి.భానుమతి మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై వివరిస్తారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: పాపకొల్లు, జూలూరుపాడు, పడమట నర్సాపురం విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ జూలూరుపాడు ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండద తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన సంజీవరాణి


ఇల్లెందు: ఇల్లెందు శాటిలైట్ బస్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా డి.సంజీవరాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొత్తగూడెంలో విధులు నిర్వహిస్తున్న ఆమెను ఇల్లెందు నూతన డిపోకు నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో బస్‌లు డిపోకు చేరుతాయని తెలిపారు. బస్ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌ల కేటాయింపు పూర్తయిందన్నారు.

'మిషన్ వాత్సల్య'ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: తల్లిదండ్రులు మరణిస్తే అనాథలైన పిల్లల కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద విద్యార్థులకు నెలకు రూ.4వేలు వారి ఖాతాలో జమ అవుతాయని, తల్లిదండ్రులు మరణించిన ధృవీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తాగునీటిని జాగ్రత్తగా వాడుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): వీకే–7షాఫ్ట్ గని త్వరలో మూసి వేయనున్నారు. దీంతో రుద్రంపూర్, గౌతమ్‌పూర్, ధన్‌బాద్ ప్రాంతాలకు గతంలో కంటే తాగునీరు తక్కువగా సరఫరా అవుతాయని, వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేం రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గతంలో కాలనీవాసులకు తాగునీటిని సరఫరా చేసేవాళ్లమని, గనిలో బొగ్గు నిక్షేపాలు నిండుకున్న నేపథ్యంలో ఆ గనిని మూసివేస్తున్నామని, ఆ స్థానంలో పీవీకే – 5 షాఫ్ట్ గని నుంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో గతంలో మాదిరి గా తాగునీరు అందకపోవచ్చని పేర్కొన్నారు.

మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కండి..

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. నాయకులు మాట్లాడుతూ.. క్రమబద్ధీకరణ అమలు చేయకుండా ప్రభుత్వం కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని, మొండి వైఖరి వీడి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్


సూపర్‌బజార్(కొత్తగూడెం): సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న నరాటి ప్రసాద్


జూలూరుపాడులో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్


పాల్వంచ: సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్


సింగరేణి(కొత్తగూడెం): అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు


ఇల్లెందురూరల్: అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

'అధికార పక్షానికే సంక్షేమ పథకాలు'


తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

ఇల్లెందు: అధికార పక్షానికే ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య ఆరోపించారు. శుక్రవారం టీపీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పట్టణ– మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కె.రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కనకయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి పథకాలు బీఆర్ఎస్ పార్టీ జెండా మోస్తున్న వారికే అందుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాల ఎంపిక స్థానిక ఎమ్మెల్యేలకు అప్పగించటం వల్ల అధికార పార్టీ నేతలు వారి కార్యకర్తలకే అందిస్తున్నారని, ఇతర పార్టీల వారిని తమ పార్టీలో చేరితే అందిస్తామంటూ ఆశలు కల్పిస్తున్నారని ఆరోపించారు. మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే లాభాపేక్ష లేకుండా అర్హులందరికీ వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లో దళారులు రాజ్యం ఏలుతున్నారన్నారు. బీసీ, గృహలక్ష్మి పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పులి సైదులు, జాఫర్, లింగంపల్లి శ్రీనివాస్, శంకర్, మసూద్, జీవీభద్రం, మహబూబ్, వెంకటనారాయణ, పాయం స్వాతి, పాయం లలిత, పూనెం కవిత, తాటి చుక్కమ్మ, చాట్ల భాగ్యమ్మ, మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, తాటి యశోద, బియ్యాని రజిని, బానోతు రోజా పాల్గొన్నారు.

అధికారులను బాధ్యులుగా చేయండి


డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎడవల్లి కృష్ణ

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి ఆర్అండ్‌బీ అధికారులను బాధ్యులను చేయాలని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ శుక్రవారం డీఎస్పీ రెహమాన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎడవల్లి మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణంలోని అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు మలుపు ఆర్‌సీ నిబంధనల ప్రకారం జరగలేదని, నిపుణులు తెలిపారని పేర్కొన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం వంపు, వెడల్పు, ఎత్తు తగిన నిష్పత్తిలో జరగలేదని, దీనివల్ల ఎత్తైన వాహనాలు పల్టీ కొట్టడం జరుగుతోందని, ఈ విషయం ఆర్అండ్‌బీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటిపాల్, పల్లపు వెంకటేశ్వర్లు, కొప్పుల రమేష్, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


టేకులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివాదం చేస్తున్న ఎస్‌కేఎం నాయకులు

టేకులపల్లి: రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ బానోతు ఊక్లా నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎస్‌కేఎం మండల కమిటీ ఆధ్వర్యంలో రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2020 రద్దు చేయాలని, రైతులకు రుణమాఫీ, రుణ విమోచన చట్టం చేయాలని, రైతులకు అనుకూలంగా ఫసల్ బీమా పథకాన్ని మార్చాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. రాబోయే రోజుల్లో రైతుల కొరకు సంఘటితంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రామచందర్, రైతు నాయకులు భూక్యా హర్జ్య, ధర్మపురి వీరబ్రహ్మాచారి, జర్పుల సుందర్, ఈసం నరసింహారావు, కే.వీరన్న, శ్రీను, వాసం భద్రయ్య, నర్సింగ్, కీర్యా, భారతి, సమ్మక్క, సీత పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మార్నింగ్ వాక్


జూలూరుపాడు: ప్రచారం చేస్తున్న బానోత్ విజయబాయి, నాయకులు

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ విజయాబాయి ఆధ్వర్యంలో శుక్రవారం పాపకొల్లు గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచారంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారం నిర్వహించారు. విజయాబాయి మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మిషన్ భగీరథ, వృద్ధాప్య పింఛన్, వీధిలైట్ల సమస్యలు అదేవిధంగా పొలాలకు వెళ్లే రోడ్లు నిర్మించాలని రైతులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో 100 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించనున్నట్లు చెప్పారు. రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.15 వేలు, ఏకకాలంలో రూ.2 లక్షల రైతు రుణమాఫీ, రూ.4 వేలు పింఛన్, రూ.500కే వంట గ్యాస్ వంటి పథకాలను గ్యారంటీ కార్డు ఇచ్చి అమలు పరచడం జరుగుతుందన్నారు. లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, నర్వనేని పుల్లారావు, ధర్మరాజు వెంకటనారాయణ, నిమ్మటూరి ముత్తయ్య, భూక్యా అమ్రు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి...

పాల్వంచరూరల్: దేశభవిష్యత్ యువత చేతిలోనే ఉందని, యువకులు రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ కోరారు. దంతలబోరు ఎస్సీ కాలనీలో శుక్రవారం మాట్లాడారు. పార్టీ కోసం పని చేస్తున్న ప్రతికార్యకర్తకు న్యాయం జరిగేలా త్వరలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు.

గందరగోళం సృష్టించొద్దు...

జూలూరుపాడు: కాంగ్రెస్ కార్యకర్తల్లో గందరగోళం సృష్టించొద్దని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పొదెం వీరయ్య నుంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తాను నియామక పత్రం అందుకున్న తర్వాత కూడా మరొకరు నేను కాంగ్రెస్ అధ్యక్షుడిని అని చెప్పుకోవడం పార్టీ శ్రేణులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధి ఘనత కాంగ్రెస్‌దే

టేకులపల్లి: ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్ రావాలంటే తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ఏజెన్సీలో ఐటీడీఏలు నెలకొల్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని సీనియర్ నాయకులు చీమల వెంకటేశ్వర్లు, భూక్యా ధన్‌సింగ్ నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి మండల కేంద్రం కు దాదాపు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బర్లగూడెం, జంగాలపల్లి, మొట్లగూడెం గ్రామాల్లో పర్యటించారు. గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించి స్థానిక సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాడుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎండీ.జలిల్, ఉన్నం నరేష్, కుంజా ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విజయభేరి సభకు తరలిరండి...

ఇల్లెందు: ఈ నెల 17న హైదరాబాద్‌లో జరగనున్న కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ప్రజలు అత్యధికంగా తరలిరావాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు డాక్టర్ జి. రవి కోరారు. శుక్రవారం ఇల్లెందులోని తన కార్యాలయంలో మాట్లాడారు. తిరుమల్, ఖాదర్‌బాబు, అన్నం సత్యనారాయణ, కమలమ్మ, కృష్ణ, బీఎన్ గోపాల్, ఆనంద్, అరవింద స్వామి, పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్లు భావితరాలకు మార్గదర్శకులు


పాల్వంచ: కేటీపీఎస్ సీఈ ప్రభాకర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

పాల్వంచ: ఇంజనీర్లు భావితరాలకు మార్గదర్శకులని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు, 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇంజనీర్స్ డే పురస్కరించుకుని హెచ్ 142 యూనియన్ ఆధ్వర్యంలో సీఈలను సన్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ.రామారావు, వెంపటి వెంకటేశ్వర్లు, సయ్యద్ శివరాం, సుమన్, గోపయ్య, కోటేశ్వరరావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ ఆల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు ఆర్కిటెక్చర్లు పాతూరి చంద్రశేఖర్‌రెడ్డి, లట్టి మురళి, అమలేశ్వరరావు, ఎస్.రామకృష్ణ, కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షుడు కాసర్ల రామారావు, గొర్ల ఉమాశంకర్, బి.రమేశ్ గౌడ్‌లను సన్మానించారు.

సుజాతనగర్: అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంజనీర్స్ డే వేడుకలు జరుపుకున్నారు. లయన్స్ క్లబ్ శ్రీనగర్ ప్రెసిడెంట్ కేవీ రంగాకిరణ్ మాట్లాడుతూ.. నేటి యువ ఇంజనీర్లు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో విశ్వేశ్వరయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రామారావు, చలపతిరావు, ఆకుల నాగేశ్వరరావు గౌడ్, ప్రిన్సిపాల్ వి.సీతారాం ప్రసాద్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.